



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 9 సంచిక : 342 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | బుధవారం 12 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :342 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | WED 12 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి



- జాతీయ సగటును మించి ఏపీ ఆర్థిక వృద్ధి నమోదు
- 2025-26లో 9.9 శాతానికి చేరిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు
- వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి
- ఎల్ నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు ఆందోళన
- సంక్షోభంలోనూ 15% వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశం

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి పథంలో పయనిస్తోంది. జాతీయ వృద్ధి రేటును అధిగమించి, వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్రం మెరుగైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు 9.9 శాతానికి చేరుకున్నట్లు జులై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రణాళికా

- మిగతా 2లో



## నకిలీ పోలీసులతో ర్యాలీలా?

### వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు

- పోలీసు వ్యవస్థను వైసీపీ నేతలు అవమానిస్తున్నారన్న అనిత
- క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదని వ్యాఖ్య
- వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసీపీ నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి

- మిగతా 2లో

## దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి

### సీఎం చంద్రబాబు పిలుపు

- 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్'కు సీఎం చంద్రబాబు పిలుపు
- 'రోడ్ డాక్టర్' పేరుతో గుంతల్లేని రహదారుల మిషన్
- ప్రజలు, ఉద్యోగులు అంతా భాగస్వాములు కావాలని సూచన
- జులై నెలలో 10.70 శాతం ఆర్థిక వృద్ధి నమోదు
- ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



**పెన్ పవర్ డెస్క్:**ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 'రోడ్ డాక్టర్' పేరుతో 'జీరో పాట్ హోల్ మిషన్'ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా 'రోడ్ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జులై నెలలో రాష్ట్రం 10.70 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని వెల్లడించిన ఆయన, రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- మిగతా 2లో



## డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే..

### నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

- పుత్తూరులో రోజా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ
- డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న రోజా
- నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని ప్రభుత్వానికి హితవు

**పెన్ పవర్ డెస్క్:**కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని, ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన డీఎస్సీ ప్రక్రియపై సీబీఐ చేత తటస్థ విచారణ జరిపించాలని కోరుతూ నగరి నియోజకవర్గం పుత్తూరు పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మొట్టమొదటి ఉద్యోగ నోటిఫికేషన్‌లోనే పేపర్ లీకేజీలు, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన నవీన్ అనే వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడమే పేపర్ లీక్ అయిందనడానికి సజీవ సాక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ నిజం కాకపోతే మొదటి ర్యాంకర్ నవీన్‌కు ఉద్యోగం ఇవ్వకుండా, రెండో ర్యాంక్ నుంచి ఎందుకు నియామకాలు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా పేరుతో దొంగ జీవోలను తెచ్చి

- మిగతా 2లో

## ఆక్వా రంగానికి 'పవర్' ఊరట:

### పాలకొల్లు సభలో జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు నిప్పులు

- ఆక్వారంగానికి రూ. 1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీ జీవోను విడుదల చేసిన అచ్చెన్న
- ఆక్వారంగం చంద్రబాబు మానసపుత్రిక అని వ్యాఖ్య
- జగన్ చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు

- మిగతా 2లో





## ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

- ఫ్లైవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు
- ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతమైందని తెలిపిన పోలీసులు
- ప్రయాణికులు కొత్త మార్గాలను అనుసరించాలని సూచన

- మిగతా 2లో

## భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం.. మార్చడం ఎవరితరం కాదు

- ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరన్న విదేశాంగ శాఖ
- 27 ప్రాంతాలకు భారత పేర్లపై చైనా అభ్యంతరం
- సరిహద్దులో శాంతి అత్యంత కీలకమన్న భారత్
- ఆగస్టు 6న ఎల్‌ఏసీ పరిస్థితిపై చర్చలు
- దౌత్య, సైనిక మార్గాలు కొనసాగించేందుకు అంగీకారం



**పెన్ పవర్ డెస్క్:**అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది. అది ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగంగానే ఉంటుందని పేర్కొంది.

- మిగతా 2లో

## తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు:

### బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక



- ఏఐపై అర్థవంతమైన మానవ పర్యవేక్షణ ఉండాలని సూచన
- 'అల్గారిథమ్ నిర్ణయించింది' అనే సమాధానం ఆమోదయోగ్యం కాదన్న ఆర్బీఐ
- రుణాలు, కస్టమర్ సేవలో ఏఐ ఎంతో ఉపయోగకరమని వెల్లడి
- ఏఐతో జరిగే మోసాలను ఎదుర్కోవడానికీ ఏఐయే అవసరమని వ్యాఖ్య

- మిగతా 2లో

## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- కేరళ పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- విపక్షాల నిరసనల మధ్య చర్చ లేకుండానే ఆమోదముద్ర
- కేరళ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్రం చర్యలు

- మిగతా 2లో





## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### జమిలి ఎన్నికలకు బ్రేక్ పడినట్లేనా?.. తెలుగు రాష్ట్రాలలో సీట్ల పెంపు లేనట్లేనా?

2029 లో జమిలి ఎన్నికలకు సంబంధించి కొంత సందిగ్ధత నెలకొంది. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల పెంపుదల కూడా కష్టమేనని అనిపిస్తుంది. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న తీరును చూస్తుంటే ప్రస్తుతం ఉభయ సభల్లో డీలిమిటేషన్ కు సంబంధించిన బిల్లులు ఆమోదం పొందే అవకాశాలు లేవు. ఇప్పటికే ఒకసారి వీగిపోయిన డీ లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు మరోసారి ఉభయ సభల ముందుకు తెచ్చి ఆమోదం పొందుదామని కేంద్ర ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా వీలు కుదరడం లేదు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ అనేది కూడా జరిగేది కష్టంగానే కనిపిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఆలోచనలకు విపక్షాలు అడ్డుకట్ట వేస్తుండటంతో ఈ దఫా రెండు తెలుగు రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య పెరుగుదలపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బొద్దింకల ఉద్యమంతో...**

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగ జెన్ జీల ఉద్యమం తర్వాత రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ డీలిమిటేషన్ కు మద్దతిచ్చిన విపక్షాల్లోని డీఎంకే వంటివి కూడా ఇప్పుడు వెనక్కుతగ్గాయి. దీంతొ వన్ నేషన్ వన్ ఎలక్షన్, డీలిమిటేషన్, మహిళ రిజర్వేషన్ల అమలుపై నీలి నీడలు కమ్ముకుంటున్నట్లుంది. జమిలి ఎన్నికలకు రాజ్యాంగ, న్యాయ, సవరణలు అవసరం. ఈ అడ్డంకులను అధికమించేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఉభయ సభల్లో మేజార్టీ కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నా అది బెడిసి కొడుతుంది. వర్షాకాలం పార్లమెంటు సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళ రిజర్వేషన్ బిల్లులను తేవాలని ఆలోచించిన ప్రభుత్వం చివరి నిమిషంలో విరమించుకుంది. తృణమూల్ కాంగ్రెస్ ను చీల్చి ఎంపీలను తమ వైపునకు తిప్పుకున్నా అనుకున్న మెజారిటీ మాత్రం రాలేదు.

**మెజారిటీ లేకపోవడంతో...**

లోక్ సభలో ఎన్డీయేకు తగిన మేజార్టీ ఉన్నప్పటికీ రాజ్యసభలో లేదు, ప్రతిపక్ష ఇండి కూటిమికి బలం ఉంది. జమిలి ఎన్నికల కోసం రాజ్యంగ సవరణ బిల్లులు లోక్‌సభలో ఆమోదం పొందిన రాజ్యసభలో గట్టెక్కే పరిస్థితి లేదు. బీజేపీ తన లక్ష్యాన్ని చేరుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలితం ఇవ్వడం లేదు. అన్నీ సాఫీగా జరుగుతున్న సమయంలో బీజేపీపై బొద్దింకలు వచ్చి పడ్డాయి. రాష్ట్ర విభజన తర్వాత తెలుగు రాష్ట్రాలు తమ అసెంబ్లీ స్థానాలను పెంచుకోవచ్చు. విభజన చట్టం సెక్షన్ 26 ప్రకారం, ఏపీ అసెంబ్లీ స్థానాలు 175 నుండి 225కి, తెలంగాణ స్థానాలు 119 నుండి 153కి పెరగాలి కానీ దానిని కేంద్రం అమలు చేయలేదు. తమకు అవసరమైన జమ్ము కాశ్మీర్ వంటి చోట్ల అసెంబ్లీ స్థానాలను బీజేపీ పెంచింది కానీ, తెలుగు రాష్ట్రాల్లో పెంచడం లేదు. దీంతో ఈ సారి కూడా ఏపీ, తెలంగాణలో సీట్ల పెంపుదల కష్టమేనని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

- మొదటి పేజి తరువాయి

విభాగం అధికారులు ఈ నివేదికను సమర్పించారు.నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ (స్టా×) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది.

ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని

సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్‌లో అరుణాచల్ అంతర్భాగం.. మార్చడం ఎవరితరం కాదు

- మొదటి పేజి తరువాయి

ఈ వాస్తవాన్ని మార్చడం ఎవరితరం కాదని తేల్చిచెప్పింది. అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు భారత పేర్లను అధికారికంగా గుర్తించడంపై చైనా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ ఈ మేరకు స్పందించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో విడదీయలేని, అంతర్భాగమని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేదన్నారు. భారత నిర్ణయాన్ని 'చెల్లదు' అంటూ చైనా చేసిన ప్రకటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు. భారత్-చైనా సంబంధాల్లో సరిహద్దు అంశాలు అత్యంత కీలకమైనవని జైస్వాల్ తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగడం రెండు దేశాల విస్తృత సంబంధాలకు ఎంతో ముఖ్యమన్నారు. సరిహద్దు పరిస్థితులు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని స్పష్టం చేశారు.

ఆగస్టు 6న జరిగిన భారత్-చైనా సరిహద్దు వ్యవహారాల సంప్రదింపులు, సమన్వయ యంత్రాంగం 36వ సమావేశంలో వాస్తవాధీన రేఖ వెంట పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగించాల్సిన అవసరాన్ని భారత్ మరోసారి నొక్కి చెప్పిందన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఉన్న దౌత్య, సైనిక మార్గాలను కొనసాగించాలని రెండు దేశాలు అంగీకరించినట్లు జైస్వాల్ తెలిపారు. డబ్ల్యూఎంసీసీ సమావేశాలు, స్థానిక కమాండర్ స్థాయి చర్చలు సహా ఇతర అంగీకరించిన మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

## తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు: బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక

కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో బ్యాంకులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. 'ఏఐ' వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు సంబంధించి పూర్తి జవాబుదారీతనం బ్యాంకులదేనని, పొరపాటు జరిగినప్పుడు ఏఐ మోడళ్లను నిందించడం ఆమోదయోగ్యం కాదని గట్టిగా హెచ్చరించారు. మంగళవారం ముంబైలో ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'ఫైబాక్ 2026' సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఏదైనా నిర్ణయం విషయంలో అంతిమ బాధ్యత బ్యాంకుదే తప్ప, సేవలు అందించిన వెండార్‌ది, అల్గారిథమ్‌ది కాదని మల్హోత్రా స్పష్టం చేశారు. "ఈ నిర్ణయం తీసుకున్నది మోడల్ అని చెప్పడం సమర్థనీయం కాదు. రెగ్యులేటర్‌గా మేము కానీ, కస్టమర్లు కానీ ఇటువంటి సమాధానాలను ఎప్పటికీ అంగీకరించం" అని ఆయన తేల్చి చెప్పారు. మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా కాకుండా, దానికి అదనపు తోడ్పాటునిచ్చే సాధనంగా మాత్రమే ఏఐని వినియోగించుకోవాలని సూచించారు. ఏఐ అందించే సిఫార్సులను విశ్లేషించగలగడం, అవసరమైనప్పుడు జోక్యం చేసుకుని వాటిని సవరించగలగడం వంటి పటిష్టమైన మానవ పర్యవేక్షణ వ్యవస్థలో అంతర్భాగంగా ఉండాలని మల్హోత్రా నొక్కిచెప్పారు. ప్రతి బ్యాంకు బోర్డు ఆమోదించిన నిర్దిష్ట ఏఐ విధానాన్ని కలిగి ఉండాలని, థర్డ్-పార్టీల నుంచి సేవలు పొందినప్పటికీ ఫలితాలకు బ్యాంకులే జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు. కస్టమర్ సేవలను మెరుగుపరచడం, జీఎస్టీ ఫైలింగ్స్, డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ వంటి డేటా ఆధారంగా రుణ సదుపాయాలను విస్తరించడం, మోసాలను గుర్తించడం వంటి అంశాల్లో ఏఐకి అపారమైన సామర్థ్యం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. అదే సమయంలో, మోడల్ పక్షపాతం, డేటా గోప్యత, సైబర్ భద్రతా ముప్పుల పట్ల బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏఐ ద్వారా జరిగే మోసాలను అడ్డుకోవడానికి కూడా తిరిగి అదే ఏఐ సాంకేతికతను ఆయుధంగా వినియోగించుకోవాలని వ్యాఖ్యానించారు.

## ఆక్వా రంగానికి 'పవర్' ఊరట:

రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు వెంటిలేటర్‌పై పడేసిన వాళ్లకు, తాడేపల్లి ప్యాలెస్ దాటని మాజీ సీఎం జగన్‌కు ఆక్వా రైతుల కష్టాల గురించి మాట్లాడే హక్కే లేదంటూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గొడ్డలి పార్టీతో ప్రజలు జాగ్రత్తగా ఉండకపోతే భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి ఊపిరి పోస్తూ రూ.1,150 కోట్ల విద్యుత్ సబ్సిడీకి సంబంధించిన జీవోను మంత్రి విడుదల చేశారు. పాలకొల్లులో ఆక్వా రైతులు ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అసెంబ్లీ ఉపసభాపతి రఘురామకృష్ణరాజులతో కలిసి అచ్చెన్నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆక్వారంగం అనేది సీఎం చంద్రబాబు నాయుడి మానసపుత్రిక అని అభివర్ణించిన ఆయన, ఐదు కోట్ల ఆంధ్రులు చేసుకున్న పూర్వజన్మ సుకృతం వల్లనే చంద్రబాబు వంటి దార్శనిక నేత దక్కారని కొనియాడారు. 2019లో ప్రజలు ఆవేశపడి దోపిడీదారులకు అధికారం కట్టబెట్టడం వల్లే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఐదేళ్లపాటు తీవ్ర ఐసీయూ స్థితిలోకి వెళ్లిందని, నాటి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు జగన్ ప్రతి చిన్న విషయాన్నీ సమస్యగా చిత్రీకరించే చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఎంతటి నిధుల కొరత ఉన్నప్పటికీ ఆక్వా రైతులను ఆదుకోవాలనే ఏకైక సంకల్పంతో ఈ భారీ విద్యుత్ సబ్సిడీని సకాలంలో విడుదల చేశామని మంత్రి వెల్లడించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీతో పాటు, చెప్పని అనేక సంక్షేమ కార్యక్రమాలను సైతం ఈ 26 నెలల స్వల్ప వ్యవధిలోనే నెరవేర్చామని గర్వంగా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ సాయంతో ఏపీ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోందని, రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మారుస్తూ 'బ్లూ ఎకానమీ' దిశగా ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు.

ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

## నకిలీ పోలీసులతో ర్యాలీలా? వైసీపీపై హోంమంత్రి అనిత నిప్పులు

- మొదటి పేజి తరువాయి

దిగజారుడు చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు. పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసీపీ సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.

## డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే.. నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి

- మొదటి పేజి తరువాయి

, పోస్టులను విచ్చలవిడిగా అమ్ముకుని రూ. కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవడం ఆపి, వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని ఆర్కే రోజా డిమాండ్ చేశారు.

## ఆగస్టు 18 నుంచి కేబీఆర్ పార్క్ చుట్టూ వన్-వే ట్రాఫిక్

హైదరాబాద్‌లోని కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) నేషనల్ పార్కు పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 18వ తేదీ నుంచి పార్కు చుట్టూ వన్-వే ట్రాఫిక్ విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనుల దృష్ట్యా ఈ మార్పులు చేస్తున్నట్లు వెల్లడించారు. నిర్మాణ పనుల కారణంగా రహదారి వెడల్పు తగ్గడంతో పాటు వాహనాల రద్దీ గణనీయంగా పెరిగిందని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వివరించారు. దీనివల్ల ఉభయ దిశల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, అందుకే వన్-వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విధానాన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకురావడానికి ముందు నిర్వహించిన పైలట్ ట్రయల్స్ ద్వారా ప్రణాళికను మరింత మెరుగుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు. నూతన విధానం అమలు కోసం పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధాన కూడళ్లలో లేన్ మార్కింగ్, లేన్ ఛేంజర్లు, దిశను సూచించే సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు 24 గంటల పాటు ట్రాఫిక్ సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. అలాగే, నావిగేషన్ యాప్‌లను సైతం అప్‌డేట్ చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, సీసీటీవీ నెట్‌వర్క్, డ్రోన్ల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ మార్పులు చేస్తామని వెల్లడించారు. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఈ వన్-వే విధానం అమలులో ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాలని కోరారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యతిరేక దిశలో వాహనాలు నడపవద్దని వారు సూచించారు.

## 'కేరళ' ఇకపై 'కేరళం'.. బిల్లుకు లోక్‌సభ ఆమోదం

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్ష సభ్యుల నినాదాలు, నిరసనల మధ్య ఎటువంటి చర్చ లేకుండానే ఈ బిల్లును సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఫలితంగా రాష్ట్రం పేరు మార్పు ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో లేకపోవడంతో, ఆయన తరఫున హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ప్రవేశపెట్టారు. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల చర్యలతో పాటు ఇతర కీలక అంశాలపై అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ గందరగోళ పరిస్థితుల నడుమనే బిల్లుకు సభ ఆమోదం ముద్రవేసింది. మలయాళంలో తమ రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలుస్తారని, అధికారికంగా కూడా అదే పేరును ఖరారు చేయాలని కేరళ శాసనసభ 2024 జూన్‌లో తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఈ ముసాయిదా బిల్లును రాష్ట్ర అసెంబ్లీకి పంపారు. 2026 జులైలో అసెంబ్లీ దీనికి ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ బిల్లు ఆమోదంతో రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో సవరణలు జరగనున్నాయి.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ

**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 11:** జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్. లక్ష్మి ఆధ్వర్యంలో తాళ్లరేవు ప్రాజెక్టు పరిధిలోని కాజులూరు మండలానికి చెందిన 80 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ వై. శ్రీదేవి తెలిపారు.జ్ఞానజ్యోతి శిక్షణలో భాగంగా మొదటి విడతగా ఆగస్టు 11, 12, 13 తేదీల్లో,రెండో విడతగా ఆగస్టు 22, 24,25 తేదీల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అంశాలపై శిక్షణ అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.ఈ శిక్షణ ద్వారా చిన్నారుల్లో శారీరక, మానసిక,భాషా,సామాజిక,భావోద్వేగ పరమైన ఐదు రకాల అభివృద్ధిని మరింత మెరుగుపరిచేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందుతాయని సీడీపీఓ



శ్రీదేవి పేర్కొన్నారు.శిక్షణను సద్వినియోగం చేసుకుని చిన్నారుల అభివృద్ధికి మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆమె సూచించారు.

# 102 తల్లి--బిడ్డ వాహనాలతో గర్భిణీలకు రవాణా కష్టాలు తొలగింపు





### మాతా శిశు ఆరోగ్య రక్షణకు భరోసా

### కాకినాడ జిల్లాకు 18 నూతన 102 వాహనాలు

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 11:** గర్భిణీలకు రవాణా ఇబ్బందులను తొలగించడంతో పాటు మాతా, శిశు మరణాలను అరికట్టడమే లక్ష్యంగా కాకినాడ జిల్లాకు 18 నూతన '102 తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నూతన 102 తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను మంగళవారం కాకినాడ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో జిల్లాకు 18 కొత్త 102 వాహనాలు మంజూరయ్యాయని తెలిపారు. గర్భిణీలు ఎటువంటి రవాణా ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు చేరుకుని మెరుగైన వైద్య సేవలు పొందేందుకు ఈ వాహనాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో మాతా, శిశు మరణాలను పూర్తిగా తగ్గించి జీరో స్థాయికి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సేవలను మరింత విస్తరిస్తోందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సేవలు అందేలా 18 వాహనాలను కేటాయించినట్లు తెలిపారు.ఈ వాహనాల ద్వారా గర్భిణీలను వారి ఇళ్ల నుంచి ఆస్పత్రికి, ప్రసవం అనంతరం ఆస్పత్రి నుంచి సురక్షితంగా తిరిగి ఇంటికి చేర్చే సదుపాయం ఉంటుందని కలెక్టర్ వివరించారు. సేవలను పొందాలనుకునే గర్భిణీలు తమ పరిధిలోని ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ల ద్వారా వాహనాలను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణీలు ఈ సేవలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సాధారణ వైద్య సేవల కోసం ఆస్పత్రికి వెళ్లాల్సిన సందర్భాల్లోనూ అవసరాన్ని బట్టి ఈ వాహనాలను వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. 102 వాహనాల సేవలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 వాహనాలు ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజారోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 500 తల్లి--బిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) వాహనాలను ప్రారంభించినట్లు తెలిపారు.కాకినాడ జిల్లాకు తొలి విడతగా మంజూరైన 18 వాహనాల్లో 7 వాహనాలను జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి కాకినాడలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గర్భిణీలను సురక్షితంగా ఆస్పత్రులకు తరలించడంతో పాటు ప్రసవం అనంతరం ఇంటికి చేర్చడంలో ఈ వాహనాలు ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో, సరైన రవాణా సదుపాయం లేని సందర్భాల్లోనూ ఈ వాహనాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఆరు ఎయిర్ బ్యాగులు, అత్యవసర సహాయం కోసం ప్రత్యేక బటన్ సౌకర్యం వంటి ఫీచర్లు ఈ వాహనాల్లో ఉన్నట్లు వివరించారు. గర్భిణీలు,జిల్లా ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. అనిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి,డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ మెహర్,ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# జగ్గంపేటలో వందేమాతరం 150 ఏళ్లపై సెమినార్

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 11:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జగ్గంపేట శాఖ ఆధ్వర్యంలో వందేమాతరం 150 సంవత్సరాల సందర్భంగా "జాతీయ స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం పాత్ర" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయవాది సీతారామస్వామి, పూర్వ ఏబీవీపీ కార్యకర్త అనూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం గీతం ప్రజల్లో జాతీయ భావాన్ని, స్వాతంత్ర్య కాంక్షను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. అనేకమంది స్వాతంత్ర్య సమరయోధులకు ఈ గీతం స్ఫూర్తినిచ్చిందని తెలిపారు. వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. వందేమాతరం గీతాన్ని రచించిన బంకిం చంద్ర చటర్జీ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జగ్గంపేట కన్వీనర్ జస్వంత్, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శాకంబరిగా కొత్తూరు సెంటర్ కనకదుర్గమ్మ



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 11;** కొత్తూరు సెంటర్ లో వెలిసిన కనకదుర్గమ్మ అమ్మవారు మంగళవారం ఆషాఢ బహుళ చతుర్దశి, మాస శివరాత్రి సందర్భంగా శాకంబరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలతో అమ్మవారిని నయనమనోహరంగా అలంకరించారు. ఆషాఢ మాసంలో శాకంబరిగా అమ్మవారిని దర్శించుకోవడం అత్యంత పవిత్రమని ఆలయ అర్చకులు హనుమాన్ తెలియజేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఏలేశ్వరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ ప్రారంభించిన ఎమ్మెల్యే.




**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 11:** స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ అంబులెన్స్ ను ప్రతిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్తిపాడు, ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రులకు తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ అంబులెన్స్ లను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో ప్రసూతి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. అన్ని ప్రాంతాల మహిళలకు ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే ఆధునిక వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం సూపర్డెంట్ వి. రమేష్ , ఎంపీపీ గొల్లపల్లి నరసింహామూర్తి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వాగు రాజేష్, వైస్ చైర్మన్ జొన్నాడ వీరబాబు, పట్టణ టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ బొదిరెడ్డి గోపాలకృష్ణ, పట్టణ టిడిపి నాయకుడు మూది నారాయణస్వామి, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మవరంలో ఘనంగా జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభం.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు 11:** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపిఓ పద్మావతి ఆదేశాలతో 6 రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ఘనంగా మంగళవారం ఘనంగా ప్రారంభించారు.అంగన్వాడీ సూపర్వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ధర్మవరం కూటమి నాయకులు సింగిలిదేవి సత్తిరాజు,బొల్లు కొండబాబు,దాట్ల అప్పన్నబాబు ప్రారంభించారు.శిక్షణలో నేర్చుకున్న అంశాలను చిన్నారుల అభ్యున్నతికి ఉపయోగించాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్,రమణ,రోహిణి,అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# వాడపల్లి వెంకన్న సన్నిధిలో వైభవంగా గోదాదేవి ఆండాళ్ తిరునక్షత్రం



### గోదాదేవి ఆండాళ్ తిరునక్షత్రానికి వాడపల్లిలో ఆధ్యాత్మిక శోభ

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 11:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి క్షేత్రంలోని శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో గోదాదేవి ఆండాళ్ తిరునక్షత్ర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆగస్టు 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆలయ ప్రాకారోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, గోదాదేవి ఆండాళ్ అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు, ఇతర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయ ప్రాకారంలో ఊరేగిస్తూ ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.ప్రాకారోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోదాదేవి ఆండాళ్ అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో గోదాదేవి ఆండాళ్‌కు నిర్వహించే తిరునక్షత్ర ఉత్సవాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ మున్నూరు వెంకటరాజు ధర్మకర్త మండలి సభ్యులు ఆలయ ఉప కమిషనర్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



రెండో రోజు జరిగిన ప్రాకారోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా భక్తులు కుటుంబ సమేతంగా వాడపల్లి క్షేత్రానికి చేరుకుని స్వామివారిని, గోదాదేవి ఆండాళ్ అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య జరిగిన ప్రాకారోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉత్సవాలు మిగిలిన రోజుల్లోనూ ఘనంగా కొనసాగనున్న నేపథ్యంలో మరింత మంది భక్తులు వాడపల్లి క్షేత్రానికి తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ వర్గాలు

# జగ్గంపేటలో రక్షిత మంచినీటి పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 11**: స్థానిక గోకవరం రోడ్డులోని అన్నపూర్ణ పౌష్టికాంప్లెక్స్ కోళ్ల ఫారాల వద్ద

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.6.33కోట్లతో చేపట్టిన రక్షిత మంచినీటి పథకాన్ని మంగళవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మహిళల వద్దకు వెళ్లి స్వయంగా బిందెలతో నీటిని పట్టి అందించారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని తీసుకువచ్చామని ఆయన తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఈ రక్షిత మంచినీటి పథకం కీలకంగా ఉపయోగపడుతుందని ఇక్కడే 15లక్షల లీటర్ల సామర్థ్యం గల మరో వాటర్ ట్యాంక్ శిధిలమవడం జరిగిందని అక్కడ మళ్ళీ శుద్ధి చేసిన మంచినీరు అందించే విధంగా తొందరలోనే వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడతామన్నారు. జగ్గంపేట మంచినీటి చెరువుకి భావారం ఫిల్టర్ వాటర్ ద్వారా నీటిని ప్యూరిఫై చేసి ప్రతి ఇంటికి త్రాగు నీటికే కాకుండా ప్రతి అవసరానికి శుద్ధి చేసిన మంచినీళ్లు అందించే చర్యలు చేపడతానని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్వ్యూలో విజయం సాధించాలంటే వ్యక్తిత్వ వికాసం ముఖ్యం

* ఆదిత్య యూనివర్సిటీలో అలుమ్ని ఇంటరాక్షన్



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 11**గండేపల్లి మండలం సూరంపాలెం: నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఎంతో అవసరమని డెవాన్స్ క్లాసెస్ వ్యవస్థాపకుడు, ఫ్రీలాన్స్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ కె. సాయి దేవన్ అన్నారు.

గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అలుమ్ని ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన కె. సాయి దేవన్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఉద్యోగ సాధనలో ఇంటర్వ్యూ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, ఆంగ్ల భాషపై పట్టు, సమర్థవంతమైన కమ్యూనికేషన్ వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలతో పాటు సాఫ్ట్ స్కిల్స్‌ను కూడా నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితోనే జగ్గంపేటలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహణ



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 11:** జగ్గంపేట పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి ఉచితంగా భోజనం అందించారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సేవా స్ఫూర్తితో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. పేదలు, కూలీలు, వృద్ధులు, ఆపదలో ఉన్న వారికి భోజనం అందించడం ద్వారా వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. అన్నదాన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు తుమ్మలపల్లి రమేష్ స్వయంగా భోజనం వడ్డించారు. భోజనం చేస్తున్న వారితో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడంతో పాటు సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తుమ్మలపల్లి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, గంధం శ్రీను, తుంగపల్లి గోవింద్ కాయల మణికంఠ, మండపాక పాపన్న దొర, గోకేడ పండు, అడబాల వీరబాబు, గుంటముక్కల పెద్ద, డ్రిల్ మాస్టారు,జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గోవిందపురం-మల్లవరం మధ్య బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 11:** జగ్గంపేట మండలం గోవిందపురం శివారు గోకవరం మండలం మల్లవరం గ్రామాల మధ్య భూపతి పాలెం సమీపంలో రూ.1.87 కోట్లతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి గ్రామీణ సమృద్ధి యోజన పథకం నిధులతో నిర్మించే బ్రిడ్జికు మంగళవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగితే గోవిందపురం, మల్లవరం గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ముఖ్యంగా భూపతిపాలెం గురుకుల పాఠశాల వద్ద కంచి కామకోటి పీఠం వారి ట్రస్టు ఆధ్వర్యంలో కేజీ నుండి పీజీ వరకు ఎడ్యుకేషనల్ హబ్ నిర్మించేందుకు సెప్టెంబర్ మొదటివారంలో ప్రతినిధులు కూడా వస్తున్నారన్నారు. ఏజెన్సీకి దగ్గర ప్రాంతమైనటువంటి ఈ ప్రాంతంలో అత్యధిక వరద తా కిడి కూడా తట్టుకునే విధంగా ఈ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ఆర్ అండ్ బి డి



ఈ మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చాలా కష్టపడి నిధులు తీసుకువచ్చి బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారంచుట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో రక్తదాన శిబిరం




**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 11**గండేపల్లి మండలం సూరంపాలెం, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, యూత్ రెడ్‌క్రాస్ విభాగాల ఆధ్వర్యంలో కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, యూత్ రెడ్‌క్రాస్ విభాగాల సమన్వయకర్తలు పర్యవేక్షించారు. రక్తదానం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించి, స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు వారిని ప్రోత్సహించారు.

రక్తదాన శిబిరంలో వైద్య బృందం తొలుత 150 మందికి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించింది. అనంతరం 116 మంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్‌కు తరలించారు.

రక్తదాన కార్యక్రమంలో సహకరించిన కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందికి రోటరీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, యువతలో రక్తదానంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల వైద్యాధికారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, ఎన్సీసీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో అధునాతన బయోమెట్రిక్ భద్రతపై శిక్షణ




**గండేపల్లి,పెన్ పవర్,ఆగస్ట్,11:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులకు అవగాహన కల్పించే లక్ష్యంతో "గోప్యతను కాపాడే బయోమెట్రిక్ ధృవీకరణ" అనే అంశంపై ఆన్‌లైన్ ధ్రువపత్ర శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఈ నెల 10న ప్రారంభించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ శిక్షణలో బయోమెట్రిక్ ధృవీకరణ విధానాలు, పనితీరు ప్రమాణాలు, కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యసనం, లోతైన అభ్యసనం, లక్షణాల వెలికితీత వంటి అంశాలతో పాటు ముఖ గుర్తింపు, వేలిముద్రలు, కనుపాప గుర్తింపు, స్వర గుర్తింపు, బహుళ రకాల బయోమెట్రిక్ విధానాలపై శిక్షణ అందించనున్నారు.

అదేవిధంగా బయోమెట్రిక్ వ్యవస్థలకు ఎదురయ్యే ముప్పులు, నకిలీ గుర్తింపు దాడులు, గుర్తింపు నమూనాల రక్షణ, బ్లాక్‌చెయిన్, సమాఖ్య ఆధారిత అభ్యసనం, సంకేతీకరణ, సున్నా-జ్ఞాన ధ్రువీకరణ వంటి ఆధునిక గోప్యత, భద్రతా సాంకేతికతలపై కూడా అవగాహన కల్పించనున్నారు.

బయోమెట్రిక్ ధృవీకరణ రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న సాంకేతిక పరిణామాలను విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమం ఆగస్టు 10 నుంచి 14వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య వనరుల వ్యక్తిగా డాక్టర్ బి. సింధు వ్యవహరించారు.

కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజినీరింగ్ అండ్ సైన్సెస్) డాక్టర్ ఏ. రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, ఆదిత్య లెర్నింగ్ అకాడమీ సమన్వయకర్త డాక్టర్ ఐ. వీరాంజనేయులు, విభాగ సమన్వయకర్త డాక్టర్ సైకం జాలయ్యతో పాటు వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో బాలికల సాధికారతపై అవగాహన సదస్సు



**గండేపల్లి,పెన్ పవర్,ఆగస్ట్ 11:**సూరంపాలెం: గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినుల కోసం "బాలికల సాధికారత -- సురక్షిత సమాజం" అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు.

ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ ఆరోగ్య, శ్రేయస్సు శిక్షకులు డాక్టర్ లక్ష్మీ ప్రకాష్ అడపా ముఖ్య వక్తగా హాజరయ్యారు. విద్యార్థినులకు వ్యక్తిగత ఆరోగ్యం, కౌమార దశలో ఎదురయ్యే ఆకర్షణలు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సామాజిక మాధ్యమాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.

మరో వక్త, వృత్తి మార్గదర్శక నిపుణురాలు తోట శ్రీనిధి విద్యార్థినులకు కుటుంబ విలువలు, జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకోవడం, భవిష్యత్తు పట్ల స్పష్టమైన దృక్పథంతో ముందుకు సాగడం వంటి అంశాలను వివరించారు. విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచిస్తూ ప్రేరణ కల్పించారు.

ఈ సందర్భంగా విద్యార్థినులు ఎదుర్కొనే సామాజిక, వ్యక్తిగత సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనే విధానం, భద్రత పట్ల అప్రమత్తత, సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన తీరుపై కూడా వక్తలు వివరించారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.టి.వి.ఎస్. కుమార్, వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వజ్రకూటంలో వైభవంగా ఇందేశమ్మ తల్లి బోనాలు....





* భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ...
* వేద పండితుల ఆధ్వర్యంలో కీర్తి వెంకట సుభాష్ దంపతుల ప్రత్యేక పూజలు....

**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 11:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం వజ్రకూటం గ్రామంలో గ్రామదేవత శ్రీ శ్రీ ఇందేశమ్మ తల్లి బోనాల ఉత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రావిచెట్టు దుర్గమ్మతల్లి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేకంగా బోనాలను ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం బోనాలను ఎత్తుకుని గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా మేళతాళాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు.గ్రామ శివారు రామన్నపాలెం వద్ద కొలువుదీరిన శ్రీ శ్రీ ఇందేశమ్మతల్లి అమ్మవారికి భక్తులు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్,ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి వెంకట సుభాష్-హేమలత దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి బోనాల ఉత్సవానికి గ్రామం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది.గ్రామ పెద్దలు,యువకులు ఉత్సవ ఏర్పాట్లలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో కీర్తి రాజు,వాసంశెట్టి సూర్య అర్జున్,కేళంగి దొరబాబు,కేళంగి సుబ్బారావు,కీర్తి మురళి,కీర్తి నాగేశ్వరరావు, యండపల్లి వీరబాబు, నామా స్వామితో పాటు అధిక సంఖ్యలో గ్రామ పెద్దలు, యువకులు,భక్తులు పాల్గొన్నారు

# ఆగస్టు 15 లోపు రైతులు పంటల భీమా నమోదు చేసుకోవాలి.

**పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏఓ,నాగం సుధామాధురి**



**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు 11:**వరి నాట్లు పూర్తి చేసుకున్న రైతులు విధిగా ఆగస్టు 15 లోపు పంటల భీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి పిలుపునిచ్చారు. మంగళవారం జగపతినగరం 1,2 రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఎల్‌నినో ప్రభావం,పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించారు.జగపతినగరం కొత్తచెరువులో నీటి లభ్యత ఆశించిన స్థాయిలో లేనందున చెరువు కింద ఉన్న మెరక పొలాల రైతులు ఆరు-తడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు.అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పంటలు సాగు చేపట్టాలని కోరారు.వరి నాట్లు పూర్తి చేసుకున్న రైతులందరూ ప్రధానమంత్రి పంటల బీమా యోజనలో చేరాలని సూచించారు.ముఖ్యంగా బ్యాంకు రుణాలు పొందని రైతులు,నమోదు చేసుకున్న కౌలు రైతులు విధిగా పంటల బీమా పథకంలో రైతులు చేరాలని సూచించారు.సమీపంలోని సామాజిక సేవా కేంద్రాల్లో ఎకరానికి రూ.760 ప్రీమియం చెల్లించి బీమా పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు శరకణం రాజుబాబు,జనసేన పార్టీ నాయకుడు దాడి చినబుజ్జి, వ్యవసాయ విస్తరణ అధికారి సీతారామమూర్తి,గ్రామ వ్యవసాయ సహాయకురాలు రమ్యతో పాటు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అంగన్వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ





**ఆత్రేయపురం, పెన్ పవర్ ఆగస్టు 11:** ఆత్రేయపురం మండలం ఉచ్చిలి జెడ్పీ హైస్కూల్‌లో అంగన్వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు విద్యా ప్రమాణాలను పెంపొందించే లక్ష్యంతో ఈ శిక్షణను నిర్వహిస్తున్నారు.

ఈ శిక్షణలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె. పద్మావతి, వై. అరుంధతి, పాఠశాల ఉపాధ్యాయులు కె. గోవిందరావు, పి. కిషోర్‌కుమార్, ఎస్. వరలక్ష్మి, ఎస్‌డీజీ ఏఎల్‌యూ మల్లెరి, అంగన్వాడీ వర్కర్ జి. వీరవేశి తదితరులు డీఆర్‌పీలుగా శిక్షణ పొంది అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ అందిస్తున్నారు.మొత్తం 59 మంది అంగన్వాడీ వర్కర్లను రెండు తరగతి గదులుగా విభజించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 11, 12, 13 తేదీలతో పాటు తదుపరి నిర్ణయించిన తేదీల్లో శిక్షణ కొనసాగనుంది. జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి, స్క్రీనింగ్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ 1 పి. వర ప్రసాద్ ఎంఈఓ 2.ఎ. సత్యనారాయణ, కేఆర్‌పీ ఇళ్ల వెంకటమణ, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రమేష్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వి. ప్రకాష్ తదితరులు హాజరయ్యారు.

అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ ద్వారా చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు అవసరమైన నైపుణ్యాలు, బోధనా పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి.

**-ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.**





**కిర్లంపూడి, పెన్ పవర్,ఆగస్టు, 11:** రెండేళ్ల కూటమి పాలనలో రాష్టం అన్ని విధాలా అభివృద్ధి సాధించడమే కాకుండా, అన్ని వర్గాల వారికి పలు ప్రజా సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో "సంక్షేమం – అభివృద్ధి – నమ్మకం" అనే నినాదంతో కిర్లంపూడి మండలం కృష్ణవరం గ గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, జగ్గంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొదిరెడ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే, టిడిపి పోలీట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఇంటింటికి తిరుగుతూ అభివృద్ధి కరపత్రాలు పంచుతూ ప్రజలకు రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అనంతరం రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన సమస్యలు విని వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కృష్ణవరం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, రోడ్లు, త్రాగునీరు, సాగునీరు, మౌలిక వసతులు ఏర్పాటు చేయడమే కాకుండా, కృష్ణవరం గ్రామంలో ఎంతమంది చదువుకుంటే అంతమందికి

తల్లికి వందనం, అవ్వా,తాతలకు,ఎన్టీఆర్ భరోసా పింఛన్లు,ఆటో డ్రైవర్ సేవలో,అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు లబ్ధి, మహిళలకు ఉచిత బస్సు, ఇలా అన్ని రకాల లబ్ధి చేకూరిందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై చూపిస్తున్న చిత్తశుద్ధి వల్లే ఈరోజు ప్రతి గ్రామానికి నిధులు వస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచితే చంద్రబాబు వచ్చాక ప్రతి పైసా ప్రజల అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్,మండల టిడిపి అధ్యక్షులు వీరంరెడ్డి కాశీబాబు, ఎంపిపి తోట రవి, టిడిపి నాయకులు కొత్త కొండబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, తోట గాంధీ, చదరం చంటిబాబు, కంచుమర్తి రాఘవ,సూరిశెట్టి వెంకటశివ,మాజీ మండల బిజెపి అధ్యక్షుడు యడాలి రాంబాబు,పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ తలంపులమ్మ అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు

**సప్త నదీ జలాలతో అమ్మవారికి విశేష అభిషేకం**





**పెన్ పవర్ ప్రతినిధి (తుని) లోవ ఆగస్టు 11**

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని లావా గ్రామంలో కొలువై ఉన్న శ్రీ తలంపులమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి సహస్ర కటాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రీ విఘ్నేశ్వర పూజ, మండపారాధన, కలశ స్థాపన, పుణ్యాహవచనం, పవిత్ర సప్త నదీ జలాల ఆవాహన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి పి. విశ్వనాథరాజు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు పెంటకోట భాస్కర సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ వేదపండితులు, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రత్యేక పూజల అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీ తలంపులమ్మ అమ్మవారి మూలవిరాట్‌తో పాటు పంచలోహ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం పవిత్ర సప్త నదీ జలాలతో అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహించి, నీరాజనం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను చేపట్టనున్నారు. దీంతో ఆషాఢ మాస మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా ముగియనున్నాయి.

## నీటి సంరక్షణ పనులపై కేంద్ర బృందం పరిశీలన

**జల సంచయ్ జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి తనిఖీలు**





**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 11 :**గండేపల్లి: జల సంచయ్ జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా గండేపల్లి మండలంలోని జెడ్.రాగంపేట, నీలాద్రిరావుపేట పంచాయతీల పరిధిలో చేపట్టిన నీటి సంరక్షణ పనులను కేంద్ర బృందం పరిశీలించింది.

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర జల సంఘం జూనియర్ ఇంజినీర్ ప్రఫుల్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సంరక్షణ కోసం చేపట్టిన పనులను పరిశీలించారు. పనుల పురోగతి, వాటి నాణ్యత, నీటి నిల్వలు పెంచేందుకు చేపట్టిన చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా నీటి వనరులను సంరక్షించడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా భూగర్భ జలాలను పెంపొందించడం కోసం గ్రామస్థాయిలో చేపట్టే పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు.

కార్యక్రమంలో పెద్దాపురం డివిజన్ సహాయక ప్రాజెక్టు సంచాలకులు ఎం. భానుప్రకాశ్, గండేపల్లి ఎంపీడీవో కె. హరికృష్ణ సత్యారెడ్డి, ఏపీవో ఎం. రామకృష్ణంరాజు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలకు కార్యకర్తలకు 'జ్ఞాన జ్యోతి' శిక్షణ....





- శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 112 మంది కార్యకర్తలకు శిక్షణ ప్రారంభం....
- చిన్నారులకు నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య అందించడమే లక్ష్యం....
- రెండు దశల్లో ఆరు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం..
- ఆటల ద్వారా అభ్యసనం,సృజనాత్మక బోధనపై ప్రత్యేక శిక్షణ...
- ఐసీడీఎస్ సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి

**శంఖవరం /రౌతులపూడి పెన్ పవర్ ఆగష్టు 11:-**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మరింత నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్యను అందించడంతో పాటు,అంగన్‌వాడీ కార్యకర్తల్లో బోధనా నైపుణ్యాలను పెంపొందించి అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే లక్ష్యంతో 'జ్ఞాన జ్యోతి ఇయర్-2,ఇయర్-3' శిక్షణ ఐసీడీఎస్ శంఖవరం ప్రాజెక్టు పరిధిలోని శంఖవరం, రౌతులపూడి మండలాల్లో మొత్తం 112 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు మొదటి దశలో మూడు రోజుల శిక్షణ,మొత్తం ఆరు రోజులపాటు రెండు దశల్లో నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఈ శిక్షణ కొనసాగనుందని శంఖవరం సెక్టార్ ఐసీడీఎస్ సీడీపీవో పర్వత వెంకటలక్ష్మి చెప్పారు.మండల కేంద్రాల్లో ఎంపిక చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఈ శిక్షణలో భాగంగా బాలల వయస్సుకు అనుగుణమైన బోధనా పద్ధతులు,ఆటల ద్వారా అభ్యసనం,బాలల భాగస్వామ్యం, సృజనాత్మక బోధన, ప్రీ స్కూల్ విద్యా నైపుణ్యాలు, చిన్నారుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే విధానాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు మెరుగైన శిక్షణ అందించేందుకు విద్యాశాఖ నుంచి శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో పాటు మహిళా,శిశు సంక్షేమ శాఖకు చెందిన సూపర్‌వైజర్లు శిక్షణ ఇస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల బోధనా నైపుణ్యాలను మరింత బలోపేతం చేయడం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన ప్రారంభ విద్యను అందించి,వారి భవిష్యత్ అభ్యసనానికి బలమైన పునాది వేయడమే 'జ్ఞాన జ్యోతి' శిక్షణ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ శిక్షణ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తల్లో మరింత నైపుణ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించి, నాణ్యమైన అంగన్‌వాడీ, నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య,ఉజ్వలమైన బాలల భవిష్యత్ దిశగా ముందుకు సాగేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ శంఖవరం ప్రాజెక్టు సీడీపీఓ పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో శంఖవరం,రౌతులపూడి అంగన్వాడీ సిబ్బంది, ఎంఈఓలు, కేఆర్‌పీ నాగప్రసాద్,సూపర్‌వైజర్లు,డీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



## శ్రావణమాసం రాకతో శుభకార్యాలకు ముహూర్తాలు

**ఆగస్టు 13 నుంచి శుభకార్యాల సందడి.. పెళ్లిళ్లు, గృహప్రవేశాలకు సిద్ధమవుతున్న కుటుంబాలు**

**పెన్ పవర్ ప్రతినిధి , ఆగస్ట్ 11ద:** శుభకార్యాలకు ఎంతో ప్రాధాన్యత కలిగిన శ్రావణమాసం ఆగస్టు 13 నుంచి ప్రారంభం కానుంది. ఈ మాసంలో వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కుటుంబాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. శ్రావణమాసం ప్రారంభంతో శుభకార్యాలకు అనుకూలమైన రోజులు వరుసగా ఉండటంతో వివాహ వేడుకలకు మరింత సందడి నెలకొననుంది.

ఆగస్టు 16, 17, 20, 21, 22, 23, 26, 27, 28, 29, 30 తేదీలను శుభకార్యాలకు అనుకూలమైన తేదీలుగా పేర్కొన్నారు. అలాగే సెప్టెంబర్ 3, 4, 5, 8, 10, 13, 14 తేదీల్లో కూడా శుభ ముహూర్తాలు ఉన్నట్లు వెల్లడించారు.

శ్రావణమాసంలో వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు వంటి కార్యక్రమాలు పెద్ద సంఖ్యలో జరగనున్న నేపథ్యంలో కల్యాణ మండపాలు, ఫంక్షన్‌హాళ్లు, క్యాటరింగ్ నిర్వాహకులు, పురోహితులు, ఫొటోగ్రాఫర్లు తదితర రంగాలకు కూడా డిమాండ్ పెరగనుంది. ఈ సీజన్‌లో దాదాపు 10 వేలకుపైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని ఫోటోలో అంచనా వేశారు.

అయితే శుభకార్యాలకు సంబంధించిన ఖచ్చితమైన ముహూర్తాన్ని కుటుంబ సంప్రదాయం, పంచాంగం, వధూవరుల జన్మనక్షత్రాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పండితుల సూచనతో నిర్ణయించుకోవాలని పేర్కొంటున్నారు

## ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి దర్శనానికి భక్తుల వెల్లువ

* ఐదు బుధవారాల కేశవుడికి భక్తుల నీరాజనం





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 11:** ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ స్వామివారి దర్శనానికి మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి సైతం భక్తులు ర్యాలి క్షేత్రానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారింది.

ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి విశిష్టమైన చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. స్వామివారి ఏకశిలా విగ్రహం ముందు పురుష రూపంలో, వెనుక స్త్రీ రూపంలో దర్శనమివ్వడం ఈ క్షేత్రం ప్రత్యేకతగా భక్తులు విశ్వసిస్తారు. అంతేకాకుండా స్వామివారి రెండు పాదాల నుంచి నిత్యం గంగ ఉద్భవిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఏకశిలా విగ్రహంతో గర్భాలయం కలిగిన అతి పురాతన దేవాలయాల్లో ర్యాలి క్షేత్రం ఒకటిగా ప్రసిద్ధి చెందింది.

ఐదు బుధవారాలు.. ఐదు ప్రదక్షిణలు

శ్రీ జగన్మోహిని కేశవ స్వామివారిని ఐదు బుధవారాలు దర్శించుకుని, ఐదు ప్రదక్షిణలు చేస్తే తమ మనసులో కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ నమ్మకంతో ప్రతి వారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ర్యాలి క్షేత్రానికి చేరుకుంటున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంగళవారం ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు స్వామివారికి విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు, పూజలు, హారతులతో స్వామివారిని భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తులకు అన్నప్రసాదం

స్వామివారి దర్శనం అనంతరం ఆలయ సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు దర్శనం, తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం తదితర విషయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. ర్యాలి క్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడికి స్వామివారి దర్శనం సౌకర్యవంతంగా కల్పించేందుకు ఆలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

పురాతన చరిత్ర, విశిష్టమైన స్వామివారి రూపం, భక్తుల విశ్వాసాలతో ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి క్షేత్రం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. స్వామివారి దర్శనానికి భక్తుల రాక నిరంతరం కొనసాగుతోంది.

# చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు 'జ్ఞానజ్యోతి' బాట-సిడిపిఓ పూర్ణిమ





**పెన్ పవర్ ప్రతినిధి ఆగస్టు 11:** చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు జ్ఞాన జ్యోతి బాట కానున్నట్లు సిడిపిఓ పూర్ణిమ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం

జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో 177 మందికి మూడు రోజుల శిక్షణ నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారిని పూర్ణిమ తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య అందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు 'జ్ఞానజ్యోతి ఇయర్-2, ఇయర్-3' శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైనట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాలకు చెందిన 177 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ శిక్షణలో పాల్గొంటున్నారన్నారు.

మూడు రోజులపాటు శిక్షణ

ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు మూడు రోజులపాటు నాన్-రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ కొనసాగనుంది. మండల కేంద్రాల్లోని ఎంపిక చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శిక్షణకు అవసరమైన ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌తో పాటు సాంకేతిక సదుపాయాలను అందుబాటులో ఉంచారు మన్నారు.

ఆటలతో అభ్యసనం.. సృజనాత్మక బోధనపై శిక్షణ

శిక్షణలో బాలల వయస్సుకు అనుగుణమైన బోధనా పద్ధతులు, ఆటల ద్వారా అభ్యసనం, బాలల భాగస్వామ్యం, సృజనాత్మక బోధనా విధానాలు, ప్రీ-స్కూల్ విద్యా నైపుణ్యాలు తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే చిన్నారుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచే విధానాలపై ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నారు.

కేఆర్పీలు, డీఆర్పీల ఆధ్వర్యంలో శిక్షణ

శిక్షణకు గుర్తించిన లికేఆర్పీ (కీ రిసోర్స్ పర్సన్స్), డీఆర్పీ (డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్)లిలు శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు. కార్యకర్తలకు బోధనలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే విధానాలతో పాటు చిన్నారులను ఆసక్తిగా అభ్యసించేలా చేసే పద్ధతులను వివరించనున్నారు.

చిన్నారుల భవిష్యత్‌కు బలమైన పునాది

అంగన్‌వాడీ కార్యకర్తల బోధనా నైపుణ్యాలను మరింత బలోపేతం చేయడం, కేంద్రాల్లోని చిన్నారులకు నాణ్యమైన ప్రారంభ విద్యను అందించడం, వారి భవిష్యత్ అభ్యసనానికి బలమైన పునాది వేయడమే 'జ్ఞానజ్యోతి' శిక్షణ ప్రధాన ఉద్దేశమని జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ తెలిపారు. ఈ శిక్షణ ద్వారా కార్యకర్తల్లో నైపుణ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించి నాణ్యమైన అంగన్‌వాడీ సేవలు, మెరుగైన ప్రీ-స్కూల్ విద్య ద్వారా బాలల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

## ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం.



-ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్,బి సూర్య అప్పారావు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు, 11:** ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్, బి సూర్య అప్పారావు అన్నారు.

మంగళవారం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటరకు స్కానింగ్ కొరకు వచ్చే సుమారు 70 మంది గర్భిణీ స్త్రీలకు జేఎన్టీయూ పూర్వ విద్యార్థి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,కె వేణుగోపాల్,ఆర్థిక సౌజన్యంతో,ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్,బి సూర్య అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేయడమే కాకుండా, గర్భిణీ స్త్రీలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుని, వైద్యులు అందించే సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు.పిల్లలపెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు , మంచి నడవడికను పెంపొందించడమేకాకుండా సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు, ఇటువంటి మంచి కార్యక్రమానికి వచ్చే నెలలో గర్భిణీ స్త్రీలకు తనవంతుగా పౌష్టికాహారం కిట్లను అందజేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ దివ్య స్రవంతి, హాస్పటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలుగుల నాని, ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్, ఇంజనీర్,లయన్ బి చంద్రమోహన్, ట్రెజరర్ లయన్ చలంకూరి కృష్ణమూర్తి, పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ రమేష్ రాజు, లయన్ గోపిరాజు, లయన్ ఇందన ఏసుబాబు, లయన్ రెడ్డి నాయుడు, లయన్ జి నాగేశ్వరరావు, లయన్ కె సంజీవరావు, లయన్ గొంప రామకృష్ణ, లయన్ అవినాష్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

'ఇంటింటికి తెలుగుదేశం'లో మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 11:** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు నిర్వహిస్తున్న 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రతి ఇంటినీ సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పథకాల అమలుపై వార్డు ప్రజల స్పందనను అడిగి తెలుసుకోవడంతో పాటు,వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.బాధితులకు ఆర్థిక చేయూత,అనారోగ్యంతో బాధపడుతున్న దొమ్మలపాటి నాగలక్ష్మిని పరామర్శించిన మంత్రి సుభాష్ ఆమెకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రమాదానికి గురై ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొండయ్యపాలెపు వెంకన్న బాబుకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.టీడీపీలో భారీగా చేరికలు

మంత్రి సుభాష్ సమక్షంలో 2వ వార్డుకు చెందిన పలువురు మహిళలు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వార్డు ఇన్‌చార్జి, యూనిట్ ఇన్‌చార్జి, బూత్ ఇన్‌చార్జి దొమ్మలపాటి విజయలక్ష్మి, వార్డు వైస్ ప్రెసిడెంట్ కాదా శ్రీను ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.మాజీ కౌన్సిలర్ పలివెల సీతామహాలక్ష్మి, జగదీష్ తదితరులు కూడా మంత్రి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి సుభాష్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమాన్ని వార్డు కమిటీ, యూనిట్ ఇన్‌చార్జిలు సమన్వయంతో నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఏడువారాల వెంకన్న దర్శనానికి భక్తుల వెల్లువ





**అష్టోత్తర పూజలో వేలాది మంది భక్తులు**

**ఆత్రేయపురం పెన్ పవర్. ఆగస్టు 12:** ఏడువారాల వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి మంగళవారం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనం చేసుకుని తమ మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.ఏడువారాల వెంకన్న దర్శనం.. ఏడేడు జన్మల పుణ్యఫలం అనే నానుడిపై విశ్వాసంతో భక్తులు ఏడువారాల పాటు స్వామివారికి వారాల నోము నోచుకుంటున్నారు. నోము పూర్తయిన అనంతరం ఆలయ సన్నిధిలో నిర్వహించే అష్టోత్తర పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి దివ్య ఆశీస్సులు పొందుతున్నారు. పూజల అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారిని దర్శించుకున్నారు.


మంగళవారం ఆలయ సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తర పూజా కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనం అనంతరం తమ మొక్కులు చెల్లించుకున్నారు.ఏడువారాల నోము, అష్టోత్తర పూజలు నిర్వహించుకోవడం ద్వారా స్వామివారి అనుగ్రహం లభిస్తుందని భక్తులు విశ్వసిస్తున్నారు. తమ కుటుంబాల్లో సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం కలగాలని కోరుకుంటూ భక్తులు స్వామివారిని ప్రార్థించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సైతం ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్‌రావు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది సమన్వయంతో సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఏడువారాల వెంకన్న దర్శనానికి భక్తుల రాక నిరంతరం కొనసాగుతుండటంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

## ఈనెల 13న 46వ జాబ్ మేళా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు

**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 11:** నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలో భాగంగా ఈ నెల 13న 46వ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రామచంద్రపురం పట్టణంలోని కేవీఆర్ హాస్పిటల్ సమీపంలో ఉన్న ఉపాధి కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 18 నుంచి 27 సంవత్సరాల వయస్సు కలిగిన టెన్త్,ఇంటర్,ఐటీఐ,డిప్లొమా, డిగ్రీ, బీటెక్ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు.శ్రీ సిటీ,చెన్నై, తిరుపతి తదితర ప్రాంతాల్లో ఉద్యోగాల కోసం వోల్టాస్,రాయల్ ఎన్‌ఫీల్డ్, యమహా,విండో ఎంఐఎం,కోల్గేట్,విట్టల్ పేపర్స్,అపోలో టైర్స్,ఎంఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ తదితర సుమారు 8 ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొననున్నట్లు వెల్లడించారు.ఎంపికైన అభ్యర్థులకు విద్యార్హత, ఉద్యోగం ఆధారంగా నెలకు రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం లభించనుంది.అలాగే కంపెనీలను బట్టి పీఎఫ్,ఈఎస్ఐ,భోజనం,వసతి, రవాణా వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం కోరారు.మరిన్ని వివరాల కోసం 7075704852, 7075904852 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com




# శబ్దకాలుష్య కారక సైలెన్సర్లు ధ్వంసం





- మాడిఫైడ్ సైలెన్సర్లపై కఠిన చర్యలు
- ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- కాకినాడ ఎస్పీ బిందు మాధవ్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 11:** అధిక శబ్దాన్ని విడుదల చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా మార్పులు చేసిన మాడిఫైడ్ సైలెన్సర్లను వినియోగించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన సైలెన్సర్లను తొలగించి, వాహనదారులకు జరిమానాలు విధించడంతో పాటు సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్నట్లు వెల్లడించారు.మంగళవారం కాకినాడ భానుగుడి సమీపంలోని ట్రాఫిక్-2 పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు.మోటారు వాహన చట్టం ప్రకారం అధిక శబ్దాన్ని కలిగించే సైలెన్సర్లు అమర్చిన వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అధిక శబ్దం కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగడంతో పాటు శబ్ద కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా మాడిఫైడ్ సైలెన్సర్ల ద్వారా పెద్ద శబ్దాలు చేస్తూ ఇతర వాహనదారులు,పాదచారులను ఇబ్బందులకు గురిచేసే వారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు.

ప్రత్యేక తనిఖీల్లో మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వాహనాలను గుర్తించి వాటిని తొలగిస్తున్నామని తెలిపారు.ఈ క్రమంలో వాహనాలకు అమర్చిన సుమారు రూ.22.50 లక్షల విలువైన 540 మాడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు.1,010 కేసులు.. రూ.14.82 లక్షల జరిమానా

మాడిఫైడ్ సైలెన్సర్లపై చేపట్టిన చర్యల్లో భాగంగా 2025లో 169 కేసులకు రూ.2,20,500 జరిమానా విధించినట్లు తెలిపారు. 2026లో ఇప్పటివరకు 841 కేసులకు రూ.12,61,605 జరిమానా విధించినట్లు వెల్లడించారు.రెండు సంవత్సరాల్లో కలిపి 1,010 కేసులు నమోదు చేసి రూ.14,82,105 అపరాధ రుసుము విధించినట్లు ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు.వాహనదారులు మోటారు వాహన చట్టం,ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని,ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వాహనాల్లో మార్పులు చేయవద్దని ఎస్పీ సూచించారు.శబ్ద కాలుష్యానికి కారణమయ్యే మాడిఫైడ్ సైలెన్సర్ల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని ఆమె కోరారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎం. కిషోర్ కుమార్,ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు,ట్రాఫిక్-2 సీఐ డి. రామారావు,ట్రాఫిక్-1 సీఐ ఎన్.రమేష్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

## గోవధ కోసం అక్రమంగా తరలిస్తున్న 32 ఎద్దులు స్వాధీనం



**గండేపల్లిలో అర్ధరాత్రి పోలీసుల వాహన తనిఖీలు.. ముగ్గురిపై కేసు**

**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 11:**గోవధ కోసం అక్రమంగా తరలిస్తున్న 32 ఎద్దులను గండేపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి ప్రాథమిక సదుపాయాలు లేకుండా, అత్యంత ఇరుకుగా ఎద్దులను బంధించి హింసిస్తూ తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

పోలీసుల వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో గండేపల్లి ఎస్సై యు.వి. శివనాగబాబు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి తిరుపతి జిల్లా సూళ్లూరుపేట వైపు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో 32 ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు.

ఎద్దులకు ఆహారం, నీరు వంటి కనీస ప్రాథమిక సదుపాయాలు కల్పించకుండా, అత్యంత ఇరుకుగా బంధించి హింసిస్తూ గోవధ కోసం అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. దీంతో 32 ఎద్దులను స్వాధీనం చేసుకుని, వాటి సంరక్షణ కోసం సమీపంలోని గోశాలకు క్షేమంగా తరలించారు.

ఈ ఘటనపై ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తును గండేపల్లి ఎస్సై యు.వి. శివనాగబాబు చేపట్టారు. అక్రమంగా పశువుల రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## వైద్య విద్యార్థిని ప్రియాంక మృతికి కారణమైన వారిపై సత్వర చర్యలు తీసుకోవాలి

**రంగరాయ వైద్య కళాశాల విద్యార్థుల శాంతి ర్యాలీ**




**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 11:** వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక మృతి తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ రంగరాయ వైద్య కళాశాల విద్యార్థులు మంగళవారం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కాకినాడ కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది.ర్యాలీ అనంతరం వైద్య విద్యార్థులు మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న డాక్టర్ ప్రియాంక మృతి బాధాకరమన్నారు.ఆమె మరణానికి కారణమైన వారిపై సత్వరమే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ విజయశేఖర్ మాట్లాడుతూ డాక్టర్ ప్రియాంక మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, కేసును వేగంగా విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. డాక్టర్ ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. వైద్య విద్యార్థులకు, మహిళలకు భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ శాంతి ర్యాలీలో డాక్టర్ తనుజ,డాక్టర్ అశ్విన్,డాక్టర్ సింధుజ, డాక్టర్ రమేష్‌తో పాటు పలువురు వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జేసీబీతో ఇల్లు కూల్చివేతపై సమగ్ర విచారణ జరపాలి

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి: చిర్ల జగ్గిరెడ్డి**





**రావులపాలెం పెన్ పవర్ ఆగస్టు 11**:మండలంలోని కొత్త కాలనీ, సోమసుందర్ రెడ్డి నగర్‌లో పేద కుటుంబానికి చెందిన ఇంటిని జేసీబీతో కూల్చివేసి కుటుంబాన్ని రోడ్డున పడేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు.మంగళవారం ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలు సత్యవతికి గతంలో ఇంటి పట్టా మంజూరైందని, దాని ఆధారంగా కుటుంబం సుమారు నాలుగున్నరేళ్లుగా అక్కడ నివాసం ఉంటూ ఇంటిని నిర్మించుకుని విద్యుత్ కనెక్షన్ పొందిందని తెలిపారు. అదే స్థలానికి సంబంధించి సివిల్ కోర్టులో వివాదం కొనసాగుతున్న సమయంలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇంటిని కూల్చివేయడం దారుణమన్నారు.

ఇంట్లో బాలింతతో పాటు కుటుంబ సభ్యులు ఉన్న సమయంలోనే జేసీబీతో ఇల్లు కూల్చివేయడం అమానుషమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా, కనీసం నోటీసులు ఇవ్వకుండా పేద కుటుంబం ఇంటిని కూల్చివేయడం ఏ విధమైన పాలన అని ప్రశ్నించారు.

ఇల్లు కూల్చివేస్తున్న సమయంలో బాధితులు 100కు ఫోన్ చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీని అక్కడి నుంచి తరలించారని తెలిపారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెబుతున్నారని, అందులో రౌడీషీటర్ పేరు కూడా ఉన్నప్పటికీ 24 గంటలు గడిచినా నిందితులను అరెస్ట్ చేయకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఘటనకు ఉపయోగించిన జేసీబీని సీజ్ చేసి, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థపై నమ్మకం నిలిచేలా చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఇదే ప్రాంతంలో హత్య ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో మరోసారి దౌర్జన్య ఘటనలు జరగడం ఆందోళనకరమన్నారు. కాలనీలో అక్రమ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని చిర్ల జగ్గిరెడ్డి అందించారు. కులం, మతం, రాజకీయ పార్టీలకు అతీతంగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు స్పందించి న్యాయం చేయకపోతే బాధిత కుటుంబంతో కలిసి పోలీస్ స్టేషన్ వద్ద న్యాయం కోసం పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ పరమావధి

**మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు**





**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఆగస్టు 11:** ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. కాకినాడ రూరల్ మండల పరిధిలోని కాకినాడ కార్పొరేషన్ 50వ డివిజన్ కొత్త గైగొలుపాడులో మంగళవారం 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి--సత్యనారాయణమూర్తి నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.టీడీపీ నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి కుశలాన్ని అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలపై ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు.ఈ సందర్భంగా నులుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషి చేయడమే 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస్ బాబా, మాజీ కార్పొరేటర్ పలివెల త్రిమూర్తులు, పలివెల గాయత్రి, మాజీ ఏఎంసీ చైర్మన్ కర్రీ వెంకటరాజు, పిల్లి కృష్ణ ప్రసాద్,కాళ్ల శ్రీనివాస్, కొమరిశెట్టి నరసింగరావు,సీనియర్ నాయకులు మాసుమెను గంగయ్య, రామ్‌కుమార్, ప్రసాద్,రూరల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దొమ్మేటి వెంకటరమణ,కొండా వినాయక్,పెంకే గోవింద్,చెల్లుబోయిన ప్రకాష్‌రావు, పడమటి వీరబాబు, గుబ్బల శివ, గుబ్బల లోవరాజు, పాలిక సతీష్, చల్మాజీ, కేబొన ఏడుకొండలు, జనసేన నాయకులు,టీడీపీ నాయకులు, నియోజకవర్గ ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వీబీజీ రామ్‌జీ పథకంపై ప్రజాప్రతినిధులకు శిక్షణ



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 11:**గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఒకరోజు అవగాహన కార్యక్రమం కార్యాలయంలో ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి ఆధ్వర్యంలో వీబీజీ రామ్‌జీ పథకంపై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీపీ చలగల దొరబాబు పాల్గొనగా ఎంపీటీసీలు, పంచాయతీ ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు. వీబీజీ రామ్‌జీ పథకం లక్ష్యాలు, అమలు విధానం, గ్రామీణ ప్రాంతాల్లో పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించే ప్రయోజనాలపై శిక్షణ ఇచ్చారు.పథకం అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ను మర్యాద పూర్వకంగా కలిసిన సలాది.

నాగేశ్వరరావుకు దుర్గగుడి చైర్మన్ సత్కారం



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 11;**విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ)ను వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం డైరెక్టర్ సలాది నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ నాగేశ్వరరావును శాలువాతో సత్కరించారు. అనంతరం నాగేశ్వరరావుకు అమ్మవారి ప్రత్యేక దర్శనం చేయించారు. దుర్గమ్మవారి దర్శనం అనంతరం నాగేశ్వరరావు అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం విశిష్టత, స్వామివారి మహిమ, ఆలయ ప్రాశస్త్యాన్ని నాగేశ్వరరావు రాధాకృష్ణకు వివరించారు. వాడపల్లి దేవస్థానాన్ని సందర్శించి శ్రీ వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకోవాలని రాధాకృష్ణను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య దేవస్థానాలకు సంబంధించిన పలు విషయాలపై ఆత్మీయంగా చర్చ జరిగింది.

# వి బి జి రాంజీ పథకం అమలుపై ప్రజలకు అవగాహన పెంచాలి-కిర్లంపూడి ఎంపీపీ తోట రవి.






**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు, 11** ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన వి బి జి రాంజీ పథకాన్ని ప్రజలకు అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయపు సమావేశపు హాలులో ఎంపీడీఓ బాయిశెట్టి హరికృష్ణ అధ్యక్షతన వి బి జి రామ్ జి పంచ సమ్మేళన కార్యక్రమం పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోట రవి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన వి బి జి రాంజీ పథక ముఖ్య ఉద్దేశాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన పెంచాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తోట గాంధీ,వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, డిప్యూటీ ఎంపీడీఓ, ఎస్ వి సుబ్బారావు, సూపరిండెంట్, ఎన్ఎంకేజీ ప్రసాద్,ఎంఈఓ లు,టి జోసెఫ్, మక్కా చిన్నారావు, జగపతినగరం పంచాయతీ కార్యదర్శి, ఎన్టీఆర్ రమేష్ బాబు,మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ, ఎంపీటీసీలు గరగ గోవిందు గోకడ దుర్గా నాగేంద్ర కుమార్ తోపాటు పలువురు ఎంపీటీసీలు ఎంజిఎన్ఆర్ఇఎస్ సిబ్బంది, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వాకలగరువులో ఇంటింటికి టీడీపీ





**అంబాజీపేట, పెన్ వర్, ఆగష్టు 11:** మండలం వాకలగరువు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. కో-కన్వీనర్ డీవీ సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభిద్ధే లక్ష్యం గా పాలన సాగిస్తుందని రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ జరిగిన వివరాలను ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు గూడాల పణిరావణం, రవణం రామ, టీడీపీ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ కాగితపల్లి సాయిరాం, క్లస్టర్ ఇన్‌చార్జ్ పితాని కేశవ, యూనిట్ ఇన్‌చార్జ్ పితాని ఈశ్వరరావు, చప్పిడి రామకృష్ణ, క్రాప నాగభూషణం, యేడిద నాగబాబు, ఉందుర్తి వెంకటేశ్వరరావు, పేరా బత్తుల సోమరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు.

# జ్ఞానజ్యోతి'తో చిన్నారులకు సమగ్రాభివృద్ధి

జిల్లా సమగ్ర శిక్ష అకాడమిక్ మోనిటరింగ్ అధికారి పి రాంబాబు.



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 11;**ఐదేళ్లలోపు చిన్నారుల సమగ్ర అభివృద్ధి కోసమే జ్ఞాన జ్యోతి శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా సమగ్ర శిక్ష అకాడమిక్ మోనిటరింగ్ అధికారి పి రాంబాబు తెలిపారు. ఆయన పర్యవేక్షణలో ఎంఈఓ 1 బి అప్పాజీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని అందరూ అంగన్వాడీ కార్యకర్తలకు మండల కేంద్రమైన ఆలమూరులోని కొత్తూరు సెంటర్లో గల హైస్కూల్లో ఐసిడిఎస్ సిడిపిఓ గజలక్ష్మి సూచనల మేరకు సూపర్వైజర్లు నాగ సత్యవేణి, వరలక్ష్మి ఆధ్వర్యంలో మూడు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ అధికారి పి రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొని సంతృప్తి వ్యక్తం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పే విధానంలో మెళకువలను ఈ శిక్షణ ద్వారా అందిస్తారని, అభ్యాసనా నైపుణ్యాలు పెంపొందిస్తారన్నారు.అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక శిక్షణను అధికారులు అందిస్తున్నారు.నూతన విద్యా విధానం అమలులో భాగంగా బోధనా తీరుపై అవగాహన కలిగిస్తున్నారని,ఇందులో భాగంగా అంగన్వాడి కార్యకర్తలకు దశలవారీగా 3 రోజుల పాటు వివిధ అంశాలపై తర్ఫీదు ఇచ్చేలా కార్యక్రమాలను రూపొందించారన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న మొదటి విడత శిక్షణలో చిన్నారుల మేథో అభివృద్ధిపై అవగాహన కల్పిస్తారని, రెండో దశలో శారీరక అభివృద్ధి, మూడో దశలో భాషాభివృద్ధి, నాలుగైదు దశలో సాంస్కృతిక, సృజనాత్మక పెంపు అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నారు. వచ్చే ఏడాది నుంచి చేపట్టే మార్పులకు అనుగుణంగా అంగన్వాడి కార్యకర్తలను ఉపాధ్యాయులు మాదిరిగా సిద్ధం చేస్తారన్నారు. తరగతి గదుల్లో బోధన ఉపకరణాల (టీఎల్ఎం) ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెబుతారు. అంగన్వాడి కేంద్రాల్లోనూ అదే విధానం పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు వారికి టీఎల్ఎం తయారీ నేర్పిస్తున్నారని పిల్లలు ఆట పాటలతో సులువుగా నేర్చుకుంటారనే ఉద్దేశంతో బొమ్మలు, సంజ్ఞల ద్వారా చిన్నారులకు ఎలా వివరించాలో తెలియజేస్తారన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో ప్రత్యేక శిక్షణ అందించేందుకు ఎమ్.వీరారాజు,ఏ శ్రీ వెంకటేశ్వర్లు, ఎమ్.రామరాజు, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొని అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ అందజేశారు.

## పల్లాలమ్మ అమ్మవారికి కముజువారిపాలెం భక్తుల సారె

డీజే, బాణసంచా నడుమ మేళతాళాలతో ఘనంగా ఊరేగింపు







**కొత్తపేట, పెన్ పవర్, ఆగస్టు 11:** కొత్తపేట మండలం వానపల్లిలో కొలువై ఉన్న శ్రీ పల్లాలమ్మ అమ్మవారికి కముజువారిపాలెం గ్రామానికి చెందిన భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో సారే సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి సారే తీసుకువెళ్లే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి నామస్మరణలతో సందడి చేశారు.

సారే సమర్పించేందుకు ముందుగా పసుపు, కుంకుమ, చీరలు, పండ్లు, పూలు తదితర మంగళ ద్రవ్యాలను సిద్ధం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం డీజే సంగీతం, బాణసంచా కాల్పుల నడుమ మేళతాళాలతో భక్తులు సారేను ఊరేగింపుగా వానపల్లి ఆలయానికి తీసుకువచ్చారు. ఊరేగింపు సందర్భంగా భక్తుల ఉత్సాహం, అమ్మవారి నామస్మరణలతో పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఆలయానికి చేరుకున్న అనంతరం భక్తులు శ్రీ పల్లాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సారేను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అమ్మవారి అనుగ్రహంతో కముజువారిపాలెం గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారికి సారే సమర్పించిన అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కముజువారిపాలెం గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సారే ఊరేగింపు, ప్రత్యేక పూజలతో వానపల్లి ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

కేవలం అర్జీలు ముగించడం కాదు... బాధితులకు పూర్తి న్యాయం జరగడమే ముఖ్యం

తప్పుడు ఎండార్స్‌మెంట్లు, క్షేత్రస్థాయి విచారణ చేయని అధికారులకు హెచ్చరిక

జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్





**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 11:**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజల నుండి వచ్చే ప్రతి అర్జీని అత్యంత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విచారించి నాణ్యమైన పరిష్కారం చూపాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ వారాంతపు సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, ఓఎస్డీ (పోలీస్) జావాళి, ఆర్డీవో కె. స్వాతి మరియు జిల్లా స్థాయి అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ శాఖల ఫిర్యాదుల పరిష్కార తీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల నిర్వహించిన "సూపర్ ఆడిట్" మరియు "మీకోసం" కాల్ సెంటర్ ఫీడ్‌బ్యాక్ పరిశీలనలో అనేక శాఖల్లో అర్జీల పరిష్కారంపై తీవ్ర లోపాలు బయటపడ్డాయని అసంతృప్తి వ్యక్తం చేశారు.నాణ్యమైన పరిష్కారమే అసలైన కొలమానం

పోర్టల్‌లో అర్జీలను కేవలం సంఖ్యల కోసం క్లోజ్ చేయకుండా, బాధితుడికి నిజమైన ప్రయోజనం చేకూరే వరకు పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారుల పనితీరును "ఫిర్యాదుల ముగింపు శాతం"తో కాకుండా ప్రజల సంతృప్తి ప్రాతిపదికన మాత్రమే అంచనా వేస్తామని తెలిపారు.క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరి

రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యను తెలుసుకోవాలని ఆదేశించారు.అర్జీదారులతో

మాట్లాడకుండా, సరైన విచారణ చేయకుండా అర్జీలను తోసిపుచ్చడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.బలహీన వర్గాల ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ

ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు, వృద్ధులు, మహిళలు మరియు నిరక్షరాస్యుల నుండి వచ్చే ఫిర్యాదులపై అధికారులు మరింత మానవీయ దృక్పథంతో స్పందించి తగిన న్యాయం చేయాలని దిశానిర్దేశం చేశారు.

జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి శాఖలో నమోదవుతున్న రెవెన్యూ, రీ-సర్వే, తాగునీరు, పంచాయతీ సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. జిల్లా అధికారులు తమ క్షేత్రస్థాయి సిబ్బందితో తరచూ సమీక్షలు నిర్వహించి నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని సూచించారు.

ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.